ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
శనివారం 14 జూన్ 2025





హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మునిసిపాలిటీల అభివృద్ధికి రూ.150 కోట్లు

- కేసముద్రంకు రూ.100 కోట్లు, మానుకోటకు రూ.50 కోట్లు మంజూరు
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలోని కేసముద్రం, మానుకోట మునిసిపాలిటీల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.150కోట్లు మంజూరీ చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన కేసముద్రం, జిల్లా కేంద్రమైన మానుకోట మునిసిపాలిటీల అభివృద్ధికి నిధులు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని అడగగానే రూ.150కోట్ల నిధులు మంజూరీ చేశారని తెలిపారు. ఇందులో కేసముద్రంకు రూ.100కోట్లు, మానుకోట మునిసిపాలిటీకి రూ.50కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అంతేకాకుండా మహబూబాబాద్ జిల్లా కేంద్రం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డును మంజూరీ చేయాలని వారిని అడగ్గా సానుకూలంగా స్పందించారని తెలిపారు.





తీవ్రంగా గాయపడిన భాస్కర్, కిష్టయ్య

మంత్రాల అనుమానం.. ఆపై బోరు వివాదం

- అన్న కుటుంబంపై కత్తులతో దాడి
- ముగ్గురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- జనగామ జిల్లా కొన్నె గ్రామంలో ఘటన

8



పత్తేపురం వద్ద లారీని వెనుక నుంచి గ్రానైట్ లారీ ఢీకొనడంతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన లారీ డ్రైవర్ బాలరాజు మృతదేహాన్ని ఎక్స్‌కావేటర్‌తో వెలికితీస్తున్న దృశ్యం (ఫైల్)

కురవిలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థిని (ఫైల్)

దంతాలపల్లిలో ఎన్‌హెచ్-563పై గుంతను తప్పించబోయి పల్టీలు కొట్టిన కారు

మృత్యుదారులు

రక్తమోడుతున్న జాతీయ రోడ్లు

- జిల్లాలో పెరుగుతున్న ప్రమాదాలు
- 10 రోజుల్లో 8 మంది దుర్మరణం
- కనిపించని సూచిక, హెచ్చరిక బోర్డులు
- ఘటనలకు నిర్లక్ష్యపు డ్రైవింగే కారణమా?
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

మహబూబాబాద్ క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు రక్తమోడుతున్నాయి. నేషనల్ రోడ్లు ప్రమాదాలకు నిలయం అవుతున్నాయి. సురక్షితం అనుకుంటే నిత్యం మృత్యుఘోష వినిపిస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లాలోని ఎన్‌హెచ్-365, ఎన్‌హెచ్-563, ఎన్‌హెచ్-930పీ జాతీయ రహదారులపై ప్రమాద హెచ్చరిక, సూచిక బోర్డులు కరువయ్యాయి. దీంతో వాహనాలు నడిపే డ్రైవర్ల నిర్లక్ష్యంతో కేవలం పది రోజుల వ్యవధిలో 8 మంది దుర్మరణం చెందారు. జాతీయ రహదారులపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జాతీయ రహదారులపై లారీలు, టాటాఏస్ ట్రాలీలు, ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలతో పాటు ఇతర వాహనాల్లో సామర్థ్యానికి మించి లోడు వేయడం, పరిమితికి మించి ప్రైవేటు వాహనాల్లో ప్రజలను ఎక్కించడం, కాలం చెల్లిన వాహనాలతోనే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోపక్క అధికారుల పర్యవేక్షణ, తరుచుగా వాహన తనిఖీలు లేకపోవడం వల్ల జాతీయ రహదారుల్లో మితిమీరిన వేగంతో నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా మహబూబాబాద్ జిల్లాకేంద్రంతో పాటు మరిపెడ, తొర్రూరు, కురవి, గూడూరు, దంతాలపల్లి గ్రామాల పరిధుల్లో జాతీయ రహదారులపై ప్రమాద సూచిక, హెచ్చరిక, లైన్ క్రాసింగ్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, పట్టుమని 18 ఏళ్ల నిండని మైనర్లు సైతం డ్రైవింగ్ చేస్తుండడం తరుచూ ప్రమాదాలకు కారణంగా ప్రజలు భావిస్తున్నారు.

పది రోజుల్లో 8మంది మృత్యువాత..

జిల్లా వ్యాప్తంగా ఉన్న మూడు జాతీయ రహదారులపై పది రోజుల వ్యవధిలోనే రోడ్డు ప్రమాదాలతో 8మంది మృత్యువాత పడ్డారు.

- గత మే 31న కురవిలో ఎన్‌హెచ్-365 రోడ్డుపై ద్విచక్ర వాహనదారుడు కత్తి రవిని కారు ఢీకొనడంతో మృతి చెందాడు.
- జూన్ 2న తొర్రూరు పాలకేంద్రం సమీపంలో రోడ్డుపై ట్రావెల్స్ బస్సు ను లారీ ఢీకొనడంతో యువకుడు వెంకన్న(22) దుర్మరణం చెందాడు.
- 4న డోర్నకల్‌కు చెందిన అజ్మీర బాలు(50), అజ్మీర సాయి(17) తండ్రీకొడుకులు ఖమ్మం పట్టణంలో లారీ కింద పడి చనిపోయారు.
- 5న మరిపెడలో ఎన్‌హెచ్-563 రోడ్డుపై టాటాఏస్ వాహనాన్ని లారీ ఢీకొనడంతో బాలు(45) మృతి చెందాడు.
- 7న కురవిలోని ఎన్‌హెచ్-365పై ఆటోను బులెరో ట్రాలీ ఢీకొనడంతో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థిని తొడుసు నేహశ్రీ(16) కన్నుమూశారు.
- 8న పెద్దవంగరలో ఎన్‌హెచ్-930పీ రోడ్డుపై సైకిల్‌పై వెళ్తున్న విద్యార్థి బి.హిందుమతి(13)ని వెనుక నుంచి టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది.
- 9న తొర్రూరు మండలం పత్తేపురం సమీపంలో ఎన్‌హెచ్-563 రోడ్డుపై లారీని గ్రానైట్ బండ లోడుతో వెళ్తున్న లారీ మరో లారీని వెనుక నుంచి ఢీకొనడంతో డ్రైవర్ బాలరాజు క్యాబిన్‌లో ఇరుక్కుని మృతి చెందాడు.
- ఈనెల 9న దంతాలపల్లి సమీపంలో ఎన్‌హెచ్ రోడ్డుపై గుంతను తప్పించపోయి కారు పల్టీ కొట్టడంతో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.

కానరాని సూచిక, ప్రమాద హెచ్చరిక బోర్డులు..

ఎన్‌హెచ్-365, ఎన్‌హెచ్-563 రహదారులపై సూచిక, ప్రమాద హెచ్చరిక బోర్డులు, రోడ్డు భద్రతా నియమాలు ఎక్కడా కనిపించడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. కల్వర్టుల వద్ద ప్రమాద హెచ్చరికలు, గ్రామాల సమీపంలో ప్రధాన కూడళ్లలో క్రాసింగ్ ఫెన్సింగ్ లైన్లు, డేంజర్ లైట్లు, స్పీడ్ బ్రేకర్లు లేవు. సంబంధిత అధికారులు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించకపోవడం, పర్యవేక్షణ లేకపోవడంకు తోడు వాహనాలు నడిపే డ్రైవర్ల నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్లనే రోడ్డు ప్రమాదాలు పెరిగి అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రహదారులపై అధికారుల తనిఖీలేవి?

జాతీయ రహదారులతో పాటు గ్రామాలు, పట్టణాలకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన రహదారులపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాత్రమే తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు పాటించని వాహనాలకు, డ్రైవర్లకు జరిమానా విధిస్తున్నారు. ఇతర సంబంధిత శాఖల అధికారులు తనిఖీల మాటే లేకపోవడంతో సామర్థ్యానికి మించిన లోడు, గ్రీన్ ట్యాక్సీ కట్టని కాలంచెల్లిన వాహనాలు తిరగడం, బీమా, ఆర్‌సీ, ఫిట్‌నెస్ వంటి ధృవ పత్రాలులేని వాహనాలు సైతం రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మైనర్లు సైతం డ్రైవింగ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు అప్రమత్తమై తరుచూ తనిఖీలు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం

జైపాల్‌రెడ్డి, డీటీవో, మహబూబాబాద్ జిల్లా

జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటాం. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం.



చిల్కోడులో విత్తన షాపులో తనిఖీలు చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల

నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల

డోర్నకల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల అన్నారు. శుక్రవారం డోర్నకల్ మండలంలోని చిల్కోడు, గొల్లచర్ల, ముల్కలపల్లి, డోర్నకల్‌లోని పలు ఎరువులు, విత్తనాల విక్రయ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు విత్తనాలు, ఎరువులను అమ్మిన వెంటనే రశీదులు ఇవ్వాలన్నారు. ప్రతి షాపులో స్టాక్ బోర్డును ప్రదర్శించి ప్రతిరోజు వివరాలను నమోదు చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్, క్రయవిక్రయాల రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీ చేయాలని సూచించారు.. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి మురళీమోహన్, ఏఈవో అవినాష్ ఉన్నారు.

పేదలందరికీ ఇళ్లు ఇవ్వడమే లక్ష్యం

- డబుల్ ఇళ్ల పేరుతో ఇసుకను అమ్ముకున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- మొదటి విడతలో నియోజకవర్గానికి 5వేల ఇళ్లు తీసుకువచ్చా..
- రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

కొత్తగూడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. పేదలకు కూడు, గూడు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించి సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో 5వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించానని, పదేళ్లలో ఒక్క ఇల్లు ఇవ్వని బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ ఇళ్ల పేరుతో ఇసుకను అమ్ముకుందని మంత్రి సీతక్క ఆరోపించారు. కొత్తగూడ మండల కేంద్రంతో పాటు గోవిందాపూర్, వేలుబెల్లి గ్రామాల్లో శుక్రవారం మంత్రి సీతక్క పర్యటించారు. కొత్తగూడలోని జడ్పీఎస్ఎస్‌లో మంత్రి సీతక్క, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు విద్యార్థులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. సీతక్క, కలెక్టర్ విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలు పంపిణీ చేశారు. కొత్తగూడ, వేలుబెల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. గోవిందాపూర్‌లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజలో పాల్గొన్నారు. కొత్తగూడలో నిర్వహించిన సభలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినందుకు పలువురు లబ్ధిదారులు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 ఇళ్లు ఇస్తే ఐటీడీఏ ద్వారా మరో 1,500 ఇళ్లు కలిపి మొత్తం 5వేల ఇళ్లు మంజూరు చేయించానని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ములుగు నియోజక వర్గానికి అదనంగా మరో 1000 ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. విడతల వారీగా అందరికి మంజూరు చేస్తామని పేర్కొన్నారు. గతంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంవత్సరానికి వేయి ఇళ్లు ఇచ్చినా ప్రజలకు ఇళ్లు ఉండేవని పేర్కొన్నారు. ఇళ్లు కట్టుకోలేక ఆర్థిక సమస్యలు ఉన్న మహిళలు సంఘంలోని డబ్బులను తీసుకుని (మిగతా 8వ పేజీలో)



మండలంలోని గోవిందాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి భూమి పూజలో పాల్గొన్న మంత్రి సీతక్క, కలెక్టర్

ప్రభుత్వ కళాశాలను సుందరంగా తీర్చిదిద్దుతాం

- నూతన భవనాన్ని నిర్మించే విధంగా చర్యలు
- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యా అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తూ అన్ని హంగులతో మహబూబాబాద్ జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు నూతన భవనాన్ని నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను శుక్రవారం సందర్శించి అధ్యాపకులు, ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడుతూ... కళాశాలలో చదివిన ఎంతో మంది వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాల్లో నిలిచారని, అంతటి ఘన చరిత్ర కలిగిన బాలుర జూనియర్ కళాశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే విధంగా కృషి చేస్తామని చెప్పారు. అందరి సహాయ సహకారాలు తీసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్‌ఎస్ నాయకులు చిట్యాల జనార్దన్, ఎడ్ల వేణు, ముత్యం వెంకన్న, మంగళంపల్లి కన్న, జెరిపోతుల వెంకన్న, మార్నేని రఘు, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, బాషికాల అంబరీష, మడత వెంకన్న పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు

- గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతాయని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూరు మండలం పత్తేపురం, చెర్లపాలెం, గోపాలగిరి, హరిపిరాల గ్రామాల్లో రూ.50లక్షల సీఆర్‌ఆర్ నిధులతో చేపట్టే డ్రెయినేజీ, సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతీ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గం మొత్తాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి సమగ్ర ప్రణాళికతో ఉన్నామన్నారు. గ్రామాల్లో నెలకొన్న ప్రతీ సమస్యను పరిశీలించి మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంత ఖర్చు అయినా భరిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు రాని వారు ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతీ ఒక్కరికి విడతల వారీగా అందజేస్తామని హామీ ఇచ్చారు. కాగా, పత్తేపురంలో డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుల్లో కమిటీ సభ్యులు అన్యాయం చేశారంటూ మహిళలు ఆందోళన చేపట్టి, తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ గూడెల్లి సోమనర్సమ్మ వెంకన్న ఎస్సీ కాలనీకు ఇళ్లు కేటాయించలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయా కార్యక్రమాల్లో హమ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, శ్యాంసుందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నాగిరెడ్డి రెడ్డి, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్, డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పుల్లారావు, ఎంపీవో అఫ్రాప్‌పాషా, ఏఈ నరేష్, కార్యదర్శులు సుధాకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



చెర్లపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి

ప్రజా సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే

తొర్రూరు: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా పాటుపడుతుందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూరులోని ఎంపీడీవో కార్యాలయంలో అర్హులైన 136మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రజలకు ఎలాంటి లోటు రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. గత పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసింది శూన్యమని, నియోజకవర్గంలో ఏమాత్రం అభివృద్ధి జరగలేదన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి అత్యధిక నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సోమ రాజశేఖర్, సంతోష్, మేకల కుమార్, రాజు, విజయ్‌పాల్ రెడ్డి, మండల పరిషత్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు

- జిల్లా వ్యాప్తంగా 102 మంది చిన్నారులచే ఓనమాలు దిద్దించిన అధికారులు, ఉపాధ్యాయులు



నేరడ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో బాలాజీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సామూహిక అక్షరాభాస్యాలు చేయించారు. ఈనెల 6 నుంచి ప్రారంభమైన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తూ 5 సంవత్సరాలు నిండిన చిన్నారులకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశాలు కల్పించారు. బడిబాటలో విద్యార్థులను నమోదు చేసుకోవడంతో పాటు ప్రతి రోజు ఓ కార్యక్రమాన్ని చేపడుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగానే 12న పాఠశాలలు పునఃప్రారంభం రోజున పేరెంట్స్ టీచర్స్‌తో సమావేశాలు నిర్వహించారు. 13న శుక్రవారం 1వ తరగతిలో ప్రవేశం కల్పించిన చిన్నారులకు జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఓనమాలు పెట్టించి దిద్దించారు. బడిబాటలో ఈనెల 13 వరకు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 2,737 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించగా, ఇందులో 102 మంది చిన్నారులకు 1వ తరగతిలో ప్రవేశాలు కల్పించి సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో జిల్లా సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాలల యాజమాన్య కమిటీల బాధ్యులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎంకు వినతి పత్రం అందజేస్తున్న 327 నాయకులు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి..

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఈఈయూ వినతి

రాంనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ అయిన టీఎస్ ఈఈయూ-327 అధ్యక్షుడు సంజీవరెడ్డి, సెక్రటరీ జనరల్ శ్రీధర్ శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆర్టిజన్ కార్మికులకు గ్రేడ్ చేంజ్ ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపచేయడం, 1999 నుంచి 2004 వరకు ఉద్యోగంలో చేరిన విద్యుత్ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా పెన్షన్ కల్పించడం, విద్యుత్ సంస్థలో మిగిలి ఉన్న 6,500మంది అన్‌మ్యాన్డ్, కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని, విద్యుత్‌సంస్థలో సబ్‌స్టేషన్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, కారుణ్యా నియామకాల వయస్సును 46 ఏళ్లకు పెంచాలని ట్రాన్స్‌కో సీటీడీ క్యాంప్‌లో పనిచేస్తున్న ఆర్టిజన్లకు విద్యార్హతలతో పనిలేకుండా గ్రేడ్-1 జీతం ఇవ్వాలని, విద్యుత్ సంస్థలో కోర్టు కేసు ద్వారా నిలిచిన ప్రమోషన్స్‌లో వెంటనే కేసు వేకెట్ చేయించి ప్రమోషన్స్ ఇప్పించాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను కోరారు. స్పందించిన ఉప ముఖ్యమంత్రి ట్రాన్స్‌కో సీఎండీతో త్వరలోనే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని 327 నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరి ఆడి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఒడిశా రోడ్డు ప్రమాదంలో ఇల్లంద యువకుడి మృతి



అనిల్ (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన యువకుడు బొంతల అనిల్ (34) ఒడిశా రాష్ట్రంలో రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాలోని భువనేశ్వర్‌కు 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న కలహండి జిల్లా రాంపూర్ మండలంలోని కదెల్ గ్రామంలో మైనింగ్ విభాగంలో అనిల్ పని చేస్తున్నాడు. పనుల నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే ఒడిశాకు బయలుదేరి వెళ్లారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించగా రాత్రి వరకు చేరుకుంటుందని స్థానికులు తెలిపారు. అనిల్ మృతితో ఇల్లందలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరు చెల్లెళ్ల వివాహం పూర్తికాగా, ఈ ఏడాది తాను కూడా వివాహం చేసుకునే సమయంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం అందరిని కలిచివేసింది.



బాల్‌బ్యాడ్మింటన్ విజేతగా నిలిచిన వరంగల్ జిల్లా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న అశోక్‌కుమార్



కబడ్డీలో విజేతగా నిలిచిన నల్లగొండ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న అశోక్‌కుమార్

విద్యుత్ శాఖ ఉద్యోగుల బాల్‌బ్యాడ్మింటన్ విజేత వరంగల్

కబడ్డీలో నల్లగొండ జిల్లా జట్టు విజయకేతనం

ముగిసిన ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్‌ల ఇంటర్ సర్కిల్ క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్‌ల ఇంటర్ సర్కిల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆతిథ్య వరంగల్ జిల్లా జట్టు మహబూబ్‌నగర్ జిల్లా జట్టుపై విజయకేతనం ఎగరవేయగా, కబడ్డీలో నల్లగొండ జట్టు విజయం సాధించింది. స్పోర్ట్స్ కౌన్సిల్ వరంగల్ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహిస్తున్న ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్‌ల విద్యుత్ ఉద్యోగుల ఇంటర్ సర్కిల్ బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. రెండురోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు మధ్య హోరాహోరీగా జరిగిన బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఆతిథ్య వరంగల్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలువగా, మహబూబ్‌నగర్ ద్వితీయ స్థానం, నల్లగొండ తృతీయ స్థానాల్లో విజయం సాధించాయి. అదే విధంగా కబడ్డీలో నల్లగొండ ప్రథమ స్థానం, వరంగల్ ద్వితీయ స్థానం, నిజామాబాద్ జిల్లా జట్టు తృతీయ స్థానాల్లో విజేయకేతనం ఎగర వేశాయి.

కాగా, జేఎన్ఎస్‌లోని కబడ్డీ కోర్టులో ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖ ఉద్యోగుల క్రీడా పోటీల ముగింపు వేడుకలకు ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్ అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ముందుగా విజేతలుగా నిలిచిన జట్లకు ట్రోఫీలను, బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించుకున్నామన్నారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని హితవు పలికారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి చేరుకోవాలని అశోక్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడ ఇంటర్ సర్కిల్ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జట్లు సెప్టెంబరు 1నుంచి 3వరకు యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఆల్ ఇండియా విద్యుత్ ఉద్యోగుల క్రీడాపోటీల్లో పాల్గొంటారని అశోక్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్ మధుసూదన్, విద్యుత్ అధికారులు విజయేందర్‌రెడ్డి, మధుసూదన్‌రావు, ఎన్.జగన్నాథన్, సాంబరెడ్డి, మల్లికార్జున్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంటీపీ సందర్శించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ



గణేష్ కంపెనీ వద్ద ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్

గీసుగొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గీసుగొండ, సంగెం మండలాల పరిధిలో శాయంపేట హవేలి శివారులో ప్రతిష్టాత్మకంగా నిర్మిసున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గణేష్ ఎకోటెక్ కంపెనీ, దక్షిణకొరియా యంగ్వాన్ కంపెనీలను ఆయన పరిశీలించారు. పార్కులో ముంపునకు గురైన నదీనాల ప్రాంతాన్ని, వరద ముంపును నివారించేందుకు పార్కు మధ్యలో 100మీటర్‌ల వెడల్పుతో నిర్మించే నదీనాలా వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వరద నీటితో పరివాహ ప్రాంతంలో రిటైనింగ్ వాల్‌ను ఏ మేరకు నిర్మించాలో ప్రతిపాదనాలు పంపించాలని ఆయన సూచించారు. కైటెక్స్ కంపెనీలోని ట్రయల్ రన్‌ను ఆయన నిశితంగా పరిశీలించారు. టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన 863 మంది భూ నిర్వాసితులకు ప్లాట్‌లు చేసిన రాజీవ్ మెగా లే అవుట్‌లో కనీస వసతుల ఏర్పాటును అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీ సిస్టం, మంచినీటి, విద్యుత్ సరాఫరా వంటి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. లే అవుట్ ప్లాట్‌లను భూ నిర్వాసితులకు వెంటనే రిజిస్టర్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చీఫ్ ఇంజనీర్ రవి, జోనల్ మేనేజర్ అజ్మీరా స్వామి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, గీసుగొంగ, సంగెం తహసీల్దార్‌లు రియాజుద్దిన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): హంటర్‌రోడ్‌లోని సీఎస్ఆర్ గార్డెన్ సమీపంలోని సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో ఫస్టియర్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోలి శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. 2025లో ఇంటర్మీడియెట్ పాసైన విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. బీఎస్సీ ఎంపీసీఎస్, ఎంసీసీఎస్, బీఎస్సీ బీజడ్‌సీ, ఎంజడ్‌సీ, బీకాం జనరల్, కంప్యూటర్స్‌తో పాటు బీఏ హెచ్‌ఈపీ గ్రూపుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అర్హత, కలిగిన విద్యార్థినులు కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని పూర్తి వివరాలకు 7995010676/9177261514 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

వరంగల్ నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు

గిర్మాజీపేట,జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా జూలై 2 నుంచి 31 వరకు వరంగల్ మీదుగా తిరుపతికి ప్రతీ బుధవారం ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం ప్రకటించింది. ప్రతీ బుధవారం ప్రత్యేక రైలు (07251) చర్లపల్లి నుంచి బయలుదేరి వరంగల్ మీదుగా తిరుపతికి వెళ్తుంది. అదేవిధంగా ప్రతీ గురువారం ప్రత్యేక రైలు (07252) తిరుపతి నుంచి బయలుదేరి వరంగల్ మీదుగా చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైలు జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్‌లో ఆగుతుంది. ఇందులో ఏసీ కోచ్‌లు, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి. ప్రయాణీకులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి శ్రీధర్ కోరారు.

నేటి నుంచి డీసెట్ వెబ్ ఆప్షన్లు ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డీసెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమై సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తైన నేపథ్యంలో శనివారం నుంచి వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందని ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ కొనసాగుతుందని, 20న సీట్ల అలాట్‌మెంట్ అవుతాయని తెలిపారు. 25 లోపు కాలేజ్‌లో రిపోర్టు చేయాలని, జూలై 1 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని ఆయన పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న జనగామ ఏసీపీ చేతన్

ఏటీఎం కార్డులు మార్చి.. డబ్బులు స్వాహా చేస్తూ..

నిందితుడి అరెస్టు.. కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

జనగామ కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంకు వచ్చేవారి దృష్టి మరల్చి ఏటీఎం కార్డులు మార్చి డబ్బులో చోరీ చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం జనగామ ఏసీపీ పండరి చేతన్ నితిన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏపీలోని పల్నాడు జిల్లా ఈపూర్ మండలం ఇనుమెల్లకి చెందిన ముల్లమూడి వెంకట కోటేశ్వర్‌రావు ఇంటర్ చదువుతున్న సమయంలో ఇంట్లో నుంచి డబ్బులు తీసుకెళ్లి బెట్టింగ్ ఆడి డబ్బులు పోగొట్టుకుని ఇంట్లో నుంచి పారిపోయాడన్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలు మొదలుపెట్టినట్లు వెల్లడించారు. ఏటీఎంలలో డబ్బులు తీయరాని ఖాతాదారుల దృష్టి మరల్చి వారి ఏటీఎం కార్డును తాను తీసుకొని తన కార్డు వారికి ఇచ్చి వారి ఖాతాలోని డబ్బును దొంగిలించేవాడని పేర్కొన్నారు.

పలు కేసులలో జైలుకు కూడా వెళ్లాడని, ఈ మధ్యకాలంలో జైలు నుంచి విడుదలై తిరిగి దొంగతనాలు మొదలుపెట్టాడన్నారు. కరీంనగర్, సిద్దిపేట, జనగామలోని ఏటీఎంలలో తనదైన శైలిలో దొంగతనాలకు పాల్పడి రూ.3,76,800 ప్రజలను మోసం చేసి దొంగిలించినట్లు గుర్తించామన్నారు. జనగామ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఎస్ఐ భరత్ గాలింపు చేపట్టగా, శుక్రవారం ఉదయం జనగామలోని ఏటీఎంల వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బస్టాండు ఏటీఎం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న అతడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. విచారించగా పై మోసాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడన్నారు.

నిందితుడి నుంచి రూ.10 వేల నగదు, తొమ్మిది ఎస్‌బీఐ ఏటీఎం కార్డులు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరు పరిచినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్ఐ భరత్, కానిస్టేబుల్లు బి.కరుణాకర్, ఎన్.సాగర్, జె.మహేందర్, సాల్మన్‌ను వరంగల్ సీపీ అభినందించారు.

భూగర్భ మురుగునీటి వ్యవస్థతోనే సురక్షితమైన జీవనం

● ఆచార్య గడ్డం భాస్కర్ ● అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థపై ప్రత్యేక సమావేశం



సమగ్ర భూగర్భ మురుగునీటి వ్యవస్థపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న నిపుణులు, పాల్గొన్న మేధావులు

హనుమకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర భూగర్భ మురుగునీటి వ్యవస్థను పటిష్ఠంగా అమలు చేసినప్పుడే ఆరోగ్యవంతమైన, సురక్షితమైన ప్రజాజీవనం కొనసాగుతుందని ఆచార్య గడ్డం భాస్కర్ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని మాస్టర్‌జీ కళాశాలలో క్రియేట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వరంగల్ అభివృద్ధి విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగంగా సమగ్ర భూగర్భ మురుగునీటి వ్యవస్థ ప్రాముఖ్యతపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆచార్య భాస్కర్ మాట్లాడుతూ.. సమగ్రమైన భూగర్భ మురుగునీటి వ్యవస్థ, ప్రాముఖ్యత, అమలులో ఎదురయ్యే ఆటంకాలు, తాత్కాలిక ప్రజల ఇబ్బందులు, దీర్ఘకాలిక ప్రయోజనాలు, సాంకేతిక సమస్యలు, పరిష్కారాలు, సౌలభ్యం, సాంకేతిక నిపుణుల సూచనలు, సలహాలు, ఇతరత్రా సంబంధిత అంశాలను ప్రజలకు తెలియచేయాలన్న ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

సాంకేతిక నిపుణుడు, రిటైర్డ్ ఎస్ఈ ఎం.రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. వరంగల్ నగరంలో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ ఏర్పాటుకు 1979లోనే సర్వే చేశామని గుర్తు చేశారు. అప్పుడు వరంగల్ పరిధి, జనాభా తక్కువగా ఉండేదని, కానీ ఇప్పుడు పెరుగుతున్న జనాభా, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు అమలుకు గత సంవత్సరం నవంబర్ 17న సూత్రప్రాయంగా రూ.417కోట్లకు ఆమోదం ఇచ్చిందని తెలిపారు. ఈ ప్రాజెక్టును పటిష్ఠంగా అమలు చేయడానికి ప్రత్యేకంగా ప్రజారోగ్యశాఖ ఎస్ఈ ఆధ్వర్యంలో సాంకేతిక నిపుణుల కమిటీని నియమించాలని, డిజిటల్ సాంకేతికత, గూగుల్ మ్యాపింగ్ కంటే క్షేత్రస్థాయిలో సర్వే జరపాలని అభిప్రాయపడ్డారు. నిపుణుల కమిటీ పర్యవేక్షణలో ప్రాజెక్టును అమలు చేసినప్పుడే గరిష్ఠంగా ప్రయోజనాలు పొందగలమన్నారు. సరైన పరిశోధన, పర్యవేక్షణ, ప్రణాళికాబద్ధమైన ఆచరణ ద్వారా మాత్రమే సమగ్ర భూగర్భ మురుగునీటి వ్యవస్థ అమలు సాధ్యమవుతుందన్నారు. కేయూ ఈసీ మెంబర్ పుల్లూరి సుధాకర్ మాట్లాడుతూ.. భూగర్భ మురుగునీటి వ్యవస్థ నిర్మాణంలో అనేక సాంకేతికపరమైన అంశాలు ఉన్నందువల్ల మురుగునీటి కాలువల నిర్మాణం మధ్యలో తెగిపోకుండా ఎస్టీపీ వరకు కొనసాగడం అత్యంత ఆవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌చాన్సలర్ ఆచార్య మహ్మద్ ఇక్బాల్ అలీ, ఆచార్య కె.విజయ్‌బాబు, మాస్టర్ జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూలా రామ్, వైద్యం రాజగోపాల్, రాజేందర్ కుమార్, బండా వివేకానందం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్ విద్యార్థులకు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్‌బీ ప్రోగ్రామ్ జాబ్ మేళాను శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని ఐసీఎస్ఎస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు వరంగల్ డీఐఈవో జి.శ్రీధర్‌సుమన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025లో ఇంటర్మీడియెట్ పాసైన విద్యార్థులు ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. 75 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.

కస్టడీ నుంచి తప్పించుకున్న నిందితుడి అరెస్టు

కాజీపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎస్కార్ట్ నుంచి తప్పించుకున్న నిందితుడిని శుక్రవారం కాజీపేట పోలీసులు అరెస్టు చేశారు. కాజీపేట సీఐ వై.సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కడిపికొండకు చెందిన కట్కూరి సాయికుమార్ ఇటీవల కాజీపేటలో ద్విచక్రవాహనాన్ని చోరీ చేశాడు. పోలీసులు ఇటీవల ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి బుధవారం వైద్యచికిత్సలకై ఎంజీఎం తరలించే క్రమంలో నిందుతుడి పారిపోయాడు. నిందితుడిని శుక్రవారం కడిపికొండలోని తన ఇంట్లో అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



మరణించిన వి. శ్రవణ్ కుమార్

కాజీపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందాడు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన సామంతపూడి శ్రవణ్ కుమార్ (36) వ్యక్తిగత పనిపై విజయవాడకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నష్కల్ రైల్వేస్టేషన్ సమీపంలోని వంగాలపల్లి రైల్వే గేట్ వద్ద రైలు నుంచి జారిపడ్డాడు. ఈ ఘటనలో శ్రవణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని చెప్పారు. మృతుడు ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

నిషేధిత గడ్డిమందు, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు



అమ్ముతున్న వ్యక్తులను అరెస్టు చూపిస్తున్న పోలీసులు.

మహాముత్తారం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మహాముత్తారం, కాటారం మండలాల్లో అక్రమంగా నిషేదిత గడ్డి మందు, నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్న ముఠాను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. మహాముత్తారం ఏవో అనుషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్న పోలీసులు వివిధ ప్రాంతాల్లో ఉన్న నిందితులను అరెస్టు చేశారు. కాటారం సీఐ నాగార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం కొంత మంది వ్యక్తులు నకిలీ పత్తి విత్తనాలు, నిషేదిత గడ్డి మందు గుట్టుగా రెండు మండలాల్లో అమ్ముతున్నరనే సమాచారంతో మహాముత్తారం ఎస్సై మహేంద్రకుమార్‌యాదవ్, వ్యవసాయాధికారులతో ఒక టీంగా ఏర్పడ్డారు. రెండు మండలాల్లో దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడులలో రూ: 5,06,250ల విలుగల 202.50 కేజీల నకిలీ పత్తి విత్తనాలు, రూ: 1,20 లక్షల విలువ చేసే 300ల లీటర్ల నిషేదిత గడ్డి మందును స్వాధీనం చేసుకొన్నామని తెలిపారు. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అచ్చ హన్మంతరావు, కాటారం మండలానికి చెందిన బొమ్మ సమ్మిరెడ్డి, మల్హర్ మండలం రుద్రారం గ్రామానికి చెం దిన జాడి సమ్మయ్య, మహాముత్తారం మండలం మీనాజిపేటకు చెందిన చీర్ల సతీష్ రెడ్డి, కాటారం గ్రామానికి చెందిన బొమ్మన వెంకటస్వామి, కాటారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కందుల కోటేశ్వర్‌రావులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఏఈవో శివకృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

ఘన చరిత్రకు సాక్ష్యం
కలెక్టర్ బంగ్లా

ఒకప్పుడు సుబేదార్ నివాసం..
నిన్నటి వరకు కలెక్టర్ ఆవాసం

- 139 ఏళ్ల కిందట నిర్మాణం
- హెరిటేజ్ మాన్యుమెంట్‌గా గుర్తింపు
- త్వరలో ప్రజల సందర్శనకు అవకాశం
- రూ.2కోట్లతో బంగ్లాకు మరమ్మతులు
- అదే ఆవరణలో కొత్త భవనంలోకి కలెక్టర్ నివాసం


ముస్తాబైన కలెక్టర్ బంగ్లా ముఖ ద్వారం

హనుమకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వరంగల్‌లో ఎన్నో ప్రత్యేక భవంతులు ఉన్నప్పటికీ హనుమకొండ సుబేదారిలో కొలువుదీరిన కలెక్టర్ బంగ్లా హంగూ ఆర్భాటాలు ప్రత్యేకమని చెప్పవచ్చు. గత వైభవానికి సాక్ష్యంగా నిలిచి ఉన్న ఈ బంగ్లాకు ఈ 139 ఏళ్ల చరిత్ర ఉంది. 1886 ఆగస్టు 10న బ్రిటీష్ అధికారి జార్జ్ బాల్మార్ భార్య ఈ బంగ్లా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్వాతంత్ర్యం రాక ముందు సుబేదార్ నివాసంగా ఉండిన ఈ భవనాన్ని స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత జిల్లా కలెక్టర్ నివాసంగా ఉపయోగిస్తూ వచ్చారు.

గత వైభవానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఈ బంగ్లాకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) రూ.2కోట్ల వ్యయంతో మరమ్మతులు చేసింది. భవనం స్వరూప స్వభావం ఏ మాత్రం చెదరకుండా, ఎలాంటి మార్పులు చేర్పులు లేకుండా యథాతథంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ బంగ్లాను పునరుద్ధరించింది. వరంగల్ జిల్లా చరిత్రకు సాక్షీభూతంగా నిలిచిన కలెక్టర్ బంగ్లాను వారసత్వ సంపదగా ప్రభుత్వం గుర్తించింది. ఈ భవనం నిర్మాణం గొప్పతనాన్ని, భవనంలోని ప్రత్యేకతలను ప్రపంచానికి తెలియచేసేందుకు త్వరలోనే ప్రజల సందర్శనార్థం తెరిచి ఉంచబోతున్నారు. ఇదే ప్రాంగణంలో వెనుక భాగాన కొత్తగా నిర్మించిన భవనంలోకి కలెక్టర్ నివాసాన్ని మార్చారు.


మరమ్మతులతో కొత్త అందాలను సంతరించుకున్న కలెక్టర్ బంగ్లా

డంగు సున్నంతో..

కలెక్టర్ బంగ్లాను ఆ కాలంలో పూర్తిగా డంగు సున్నంతో కట్టారు. ఎక్కడా సిమెంట్, కాంక్రీట్ వాడలేదు. పైఅంతస్థు నిర్మాణంలో, అలాగే టెర్రస్‌లో నాణ్యమైన టేకు కర్రలను ఉపయోగించారు. బంగ్లాకు మరమ్మతులు చేసేప్పుడు ఏ మాత్రం సిమెంట్ వాడలేదు. బంగ్లా బాగా పాతపడిపోవడంతో లోపలిగోడలు, స్తంభాలు, పైకప్పు పెచ్చులూడిపోయాయి. దీంతో గోడలన్నిటినీ పూర్తిగా చెక్కి, మళ్లీ డంగు సున్నంతోనే ప్లాస్టరింగ్ చేసింది. డంగు సున్నాన్ని హైదరాబాద్ నుంచి తెప్పించారు. కొంత స్థానికంగా తయారు చేశారు. మరో వందేళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా మరమ్మతులు చేశారు. బంగ్లాలో దెబ్బతిన్న కిటికీలు, పైకప్పు దూలాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవాటిని అమర్చారు, పై అంతస్థుకు వెళ్లడానికి ఉన్న చెక్కమెట్లను అలాగే ఉంచి దెబ్బతిన్న చోట మరమ్మతులు చేశారు. బ్రిటీష్ కాలంలో కరెంట్ ఉండేది కాదు. వెలుతురు కోసం పొగరాని కొవ్వొత్తులను ఉపయోగించేవారు. ఈ కొవ్వొత్తులను అమర్చడానికి ఆ నాడు ఉపయోగించిన అందమైన షాండ్లియర్స్ ఇప్పటికీ అలాగే చెక్కు చెదర కుండా ఉన్నాయి. వాటిని ఏ మాత్రం మార్చ కుండా అవసరమైన చోట మరమ్మతులు చేశారు. బంగ్లా ప్రవేశ ద్వారంపైన ఒక పెద్ద గడియారం ఉన్నది. జర్మనీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేసిన ఈ గడియారం పాతబడి పని చేయడం లేదు. దీనిని కూడా తిరిగి పని చేసేలా రూ.5లక్షల వ్యయంతో మరమ్మతులు చేశారు. బంగ్లా ఆవరణలో ఉన్న పురాతనమైన ఫౌంటేన్‌కు కూడా మరమ్మతులు చేశారు. గార్డెన్‌ను అభివృద్ధి చేశారు. గ్రీనరీని పెంచారు. బంగ్లా అంతా సున్నం వేసి అందంగా తీర్చిదిద్దారు. దర్వాజలు, కిటికీలు, పైకప్పు దూలాలకు ఆ కాలం నాటి రంగులనే వాడారు. పైకప్పు కారకుండా పూర్తిగా వాటర్ ప్రూఫ్ చేశారు. కొత్తగా కరెంట్ వైరింగ్‌ను అప్పటి పద్ధతిలోనే చేశారు. ఈ బంగ్లాలో మొత్తం 18 గదులు, ఒక విశాలమైన పోర్టికో, పైఅంతస్తుకు వెళ్లడానికి మెట్లు ఉన్నాయి. వాటన్నిటికీ కొత్త రూపును ఇచ్చారు. కలెక్టర్ బంగ్లాలో నిజాం కాలంలో తవ్విన రెండు పురాతన బావులు కూడా ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. బంగ్లాలో నివసించేవారికి అసవరమైన నీటిని ఈ బావుల నుంచే వాడుకునేవారు. వీటిని కూడా మరమ్మతులు చేశారు.

ప్రజల సందర్శనార్థం

ఇటీవలి వరకు కలెక్టర్లకు నివాసంగా ఉన్న ఈ పురాతన భవనం ఇక నుంచి ఒక వారసత్వ కట్టడంగా ఉండబోతోంది. కలెక్టర్ నివాసం కోసం ఈ బంగ్లా ఆవరణలోనే కొత్తగా మరో భవనం నిర్మించారు. ప్రజల సందర్శనకు త్వరలోనే పాత కలెక్టర్ బంగ్లా గేట్లు తెరవబోతున్నారు. ఒక హెరిటేజ్ మాన్యుమెంట్‌గా సంరక్షించనున్న ఈ భవనంలో వరంగల్ జిల్లా చారిత్రక, సాంస్కృతిక వారసత్వ వైభవాన్ని ప్రతిబింబించే ప్రదర్శనశాలను, శతాబ్దకాలంలో చోటు చేస్తున్న చారిత్రక ఘట్టాలను ప్రతిబింబించే ఛాయాచిత్రాలు, గ్రంథాలు, పురాతన వస్తువులతో కూడిన ఆర్కీవ్‌ను కూడా ఏర్పాటు చేస్తారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఉన్న చారిత్రక ఆనంద్ భవన్ తరహాలో దీనిని తీర్చిదిద్దుతారు.


కలెక్టర్ బంగ్లా ఆవరణలో అభివృద్ధి చేసిన గ్రీనరీ

ప్రత్యేకతల సమాహారం

50 మంది కలెక్టర్లు నివాసమున్న ఈ బంగ్లా నిజాం పాలనలో జరిగిన అతి పెద్ద కట్టడాల్లో ఒకటి. ఇందులోకి అడుగుపెడితే చిత్రవిచిత్రాలనెన్నో కనిపిస్తాయి. భవన నిర్మాణంలో తీసుకున్న శ్రద్ధ అనువణువునా కనిపిస్తుంది. భవనం బయటికి ఎంత అందంగా ఉంటుందో లోపల కూడా అంతే రాజసంగా కనిపిస్తుంది. అడుగడుగునా ఆనాటి భవన నిర్మాణ కార్మికుల నేర్పరితనం గోచరిస్తుంది. కలెక్టర్ బంగ్లాను సుబేదార్ బంగ్లా అని కూడా పిలుస్తారు. నిజాం రాజు పరిపాలనా సౌలభ్యం కోసం తన రాజ్యాన్ని ఆరు సుభాలుగా విభజించాడు. ఇందులో వరంగల్ సుభా ఒకటి. ఈ సుభా కింద 61 పరగణాలు ఉండేవి. ఆ కాలంలో సుబేదారిని లష్కర్ అని కూడా పిలిచేవారు. సుభాను పర్యవేక్షించడానికి అప్పట్లో సుబేదార్ ఉండేవాడు. ఆయన నివాసం కోసం ఆ నాడు కట్టిందే ఈ ఈ బంగ్లా. రాజం ఉట్టిపడేలా, ఒక కోటను తలదన్నే రీతిలో బంగ్లా నిర్మాణం జరిగింది. దాదాపు 13 ఎకరాల విస్తీర్ణంలో రెండు ఎకరాల స్థలంలో నిర్మించారు. రాచరిక తీవికి నిదర్శనంగా ఈ భవనం నిలుస్తుంది.

ఆకట్టుకునే నిర్మాణ శైలి

బంగ్లాలోపలికి వెళ్లే ముందు పెద్ద కమాను కనిపిస్తుంది. ఈ కమానుపైన అతి పెద్ద గడియారాన్ని ఏర్పాటు చేశారు. లోపల ఉన్న విశాల ప్రాంగణంలో పచ్చిక బయళ్లు, నీటి కొలను, అందులో అతిపెద్ద ఫౌంటేన్ కనిపిస్తాయి. అతిథులతో కూర్చొని మాట్లాడటానికి వీలుగా విశాలమైన హాలును నిర్మించారు. ఈ భవనంలోపలికి వెళ్లడానికి ఒక వైపు మాత్రమే మార్గం ఉంది. పైఅంతస్తులో ఒక విశాలమైన టెర్రస్ వంటి నిర్మాణం ఉంటుంది. భవన నిర్మాణం అద్భుతంగా ఉంటుంది. ప్రతీ అంతస్తులో చెక్కమెట్లు ఉన్నాయి. అవి ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ధారాళంగా గాలి, వెలుతురు రావడానికి వీలుగా తలుపులు, కిటికీలను వరుసగా అమర్చారు. వాటికి దగ్గట్టుగా గదుల నిర్మాణం చేశారు.

భవనాలకు మరమ్మతులు

భవిష్యత్తు తరాలకు ఈ భవన నిర్మాణ కౌశలాన్ని తెలియచేసేందుకు ఇది ఒక నిదర్శనంగా మిగులుతుంది. ఈ బంగ్లా వరంగల్‌కు ఒక ఐకాన్. ఎన్నో ఉపద్రవాలను ఎదుర్కొని సజీవసాక్ష్యంగా నిలిచింది. వరంగల్‌కు ఎన్నిసార్లు వరదలు వచ్చినా ఇంచు మందం కూడా చెక్కుచెదరని చారిత్రక సంపద ఈ నిర్మాణం. ఈ బంగ్లాను పరిరక్షించాల్సిన అవసరం ఉందని, లేదంటే కాలగతిలో కలిసిపోయే ప్రమాదం ఉందని గుర్తించిన కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ దీని సంరక్షణ బాధ్యతను తీసుకున్నది. ఇందులో భాగంగానే భవనానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి త్వరలో ప్రజల సందర్శనార్థం ఉంచబోతోంది. వీటితో పాటు వంద సంవత్సరాలు దాటిన మరికొన్ని పురాతన కట్టడాలకు మరమ్మతు చేసి వాటిని కూడా హెరిటేజ్ మాన్యుమెంట్లుగా పరిరక్షించే బాధ్యతను కూడా చేపట్టబోతోంది. నిజాం కాలం నాటి భవనాల్లో ప్రస్తుతం వరంగల్ కలెక్టర్ కార్యాలయం ఉన్న ఒకప్పటికీ నీటిపారుదల శాఖ కార్యాలయ భవనం, నక్కలగుట్టలోని నీటిపారుదలశాఖ ఈఈ కార్యాలయం భవనం, సుబేదారిలోని డీఐజీ బంగ్లా, ఆర్టీసీ ఓల్డ్‌బస్ డిపోకు ఎదురుగా గల ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, హనుమకొండ విజయటాకీస్ రోడ్డులోని రాజరాజనరేంద్ర భాషానిలయం మొదలైనవి వీటిలో ఉన్నాయి. వీటిని కూడా వరంగల్ వారసత్వ సంపదగా పరిరక్షించాలని నిర్ణయించింది.


కలెక్టర్ బంగ్లా మరమ్మతు పనుల్లో కూలీలు

అమూల్యమైనది రక్తదానం

- బ్లడ్ డొనేషన్‌పై పెరుగుతున్న స్పృహ
- అత్యవసరంలో ముందుకొస్తున్న రక్తదాతలు
- ప్రత్యేక వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు
- అవసరమైన చోటుకు వెళ్లి రక్తదానం
- మానవత్వం చాటుతున్న యువత
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం


ఏప్రిల్ 14న 94వ సారి రక్తదానం చేస్తున్న మల్లిగారి రాజు

జనగామ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సకాలంలో అవసరమైన రక్తం అందక ఎన్నో ప్రాణాలు అంతవాయువుల్లో కలుస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో రూ.లక్షలు వెచ్చించినా కావాల్సిన గ్రూపు రక్తం దొరకడం కష్టం. ఈ క్రమంలో ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తి ప్రాణాలు నిలపడం కష్టమే. కానీ రక్తదాతలు ముందుకొచ్చి రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలు నిలుపుతున్నారు. గత పదేళ్లతో పోలిస్తే ప్రస్తుత సమాజంలో రక్తదానంపై యువత, నడివయస్సు వారిలో స్పృహ, అవగాహన భారీగా పెరగడం హర్షించదగ్గ విషయం. ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులు, బాధితుల పరిస్థితులను చూసి చలించి ఎంతో మంది యువత ముందుకు వచ్చి రక్తదాతలుగా మారుతున్నారు. అవసరమైతే సొంత ఖర్చులు భరించే దూర ప్రాంతాలకు వెళ్లి మరీ రక్తదానం చేసి వస్తున్నారు. కళ్లెదుట చావులను చూసి కొందరైతే, ప్రాణం విలువ తెలిసి కొందరు రక్తదాతలుగా మారుతున్నారు. పదుల సంఖ్యలో రక్తదానాలు చేస్తూ పలువురి ఆదర్శంగా నిలుస్తున్నారు.

వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు

రక్తదానంపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి రక్తం అందించేందుకు కొంతమంది యువత వాట్సాప్‌ను వేదికగా చేసుకున్నారు. రక్తదానం పేరుతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి ఆసక్తి ఉన్న రక్తదాతలను, ప్రముఖులను అందులో చేర్చుతున్నారు. రక్తం అవసరమైతే రక్తదాత వాట్సాప్ గ్రూపులతోపాటు ఇతర ఇతర గ్రూపుల్లో మెసేజ్‌లు పెడుతున్నారు. స్పందించిన యువకులను తీసుకెళ్లి రక్తదానం చేయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో రక్తదాన గ్రూపులను యువత ఏర్పాటు చేసుకొని ఆదర్శంగా నిలుస్తున్నారు.

రక్తదానంతో ప్రాణదానం

రక్తదానం చేస్తే ఒకరికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రాణదానం చేసినట్లే. రక్తదానాన్ని ప్రోత్సహించేందుకు జూన్ 14న ప్రపంచ రక్తదాత దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. దేశవ్యాప్తంగా ప్రతీ రోజూ పెద్ద సంఖ్యలో రక్తం అవసరమవుతూ ఉంటుంది. ప్రతీ ఆస్పత్రిలో ఉన్న బ్లడ్ బ్యాంకులు సైతం డిమాండ్ తగ్గట్టుగా రక్తాన్ని అందించలేకపోతున్నాయి. చాలా అరుదైన గ్రూపులైన ఏబీ నెగిటివ్, బీ నెగిటివ్ రక్తం దొరకడం చాలా కష్టమవుతోంది. దేశ జనాభాలో ఏబీ నెగిటివ్ గ్రూపు రక్తం 0.6శాతం, బీ నెగిటివ్1.5శాతం మందికి మాత్రమే ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా ప్రతీ నెలా ఒక కోటి 46లక్షల యూనిట్ల రక్తం అవసరమ వుతుందని గణాంకాలు చెబుతున్నాయి. ఇందుకు ప్రతీ 1000 మందికి 36.3మంది చొప్పున రక్తదానం చేయాల్సి ఉంటుందని అంచనా.

ఇప్పటికి 94 సార్లు రక్తదానం



రక్తం అందకపోవడంతో మా మేనమామ చనిపోవడం నన్ను రక్తదాతను చేసింది. 1997లో రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొంది. సకాలంలో రక్తం అందకపోవడంతో చనిపోయారు. అలాంటి దుస్థితి ఎవరికీ రావద్దొన్న నిర్ణయానికి అప్పుడే వచ్చాను. నా 19 ఏళ్ల వయస్సులో రక్తదానం చేయడం ప్రారంభించాను. ఈ 28 ఏళ్లలో 94 సార్లు రక్తదానం చేశాను. ప్రతీ మూడు నెలలకు ఒకసారి కచ్చితంగా, మధ్యలో మహనీయుల జయంతి సందర్భంగా రక్తదానం చేస్తుంటాను. రక్తం అవసరముందని తెలిస్తే చాలా సొంత ఖర్చులతో హైదరాబాద్‌కు వెళ్లి కూడా ఇచ్చి వచ్చాను.

-మల్లిగారి రాజు, జనగామ

'అమ్మ బ్లడ్ డోనర్' గ్రూపు ద్వారా..



ప్రజల్లో రక్తదానంపై అవగాహన కల్పించడంతోపాటు అత్యవసర సమయాల్లో రక్తదానం చేసేలా ప్రోత్సహించేందుకు 'అమ్మ బ్లడ్ డోనర్' అనే వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశాం. 2019 డిసెంబరులో ఏర్పాటు చేసిన గ్రూపు ద్వారా చాలా మంది రక్తదానం చేశాం. అవసరమున్న వారి వివరాలను ఆ గ్రూపుతో పాటు ఇతర వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్ పెడతాం. ఆసక్తి ఉన్న వారిని తీసుకెళ్లి వారితో రక్తదానం చేయిస్తాం. ఎవరిదైనా బర్త్‌డేలు అయిన సందర్భంలోనూ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లి రక్తదానం చేయిస్తాం. అప్పట్లో పెద్దగా పట్టించుకోపోగా ప్రస్తుతం యువతలో రక్తదానంపై అవగాహన, ఆసక్తి ఏర్పడింది.

-మంతెన మణి, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, జనగామ

మీ శాఖల నుంచి ఉద్యోగులను పంపండి..

- ఇతర శాఖలకు లేఖ రాసిన దేవాదాయ శాఖ
- ఈవోలు, ఏసీలు, డీసీలుగా పని చేసేందుకు ఆహ్వానం
- దేవాదాయశాఖ ఉద్యోగుల్లో కలకలం

హనుమకొండ కల్చరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఇతర ప్రభుత్వ శాఖల నుంచి అధికారులను, ఉద్యోగులను డిప్యూటేషన్‌పై తీసుకోవాలని దేవాదాయశాఖ తీసుకున్న నిర్ణయంపట్ల ఈశాఖలో పని చేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.దేవాదాయశాఖలోనే బోలెడంత మంది అనుభవం కలిగిన ఉద్యోగులు ఉండగా.. ఇతర శాఖల నుంచి తీసుకోవడం ఎందుకు అని వారు ప్రశ్నిస్తున్నారు. దేవాదాయ శాఖలో రెగ్యులర్ ఉద్యోగుల నియామకం జరిగే వరకు కార్యనిర్వహణ అధికారులుగా, అసిస్టెంట్ కమిషనర్లుగా, డిప్యూటీ కమిషనర్లుగా డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు అర్హులైన ఉద్యోగులను తమ శాఖల నుంచి డిప్యూట్ చేయాలని కోరుతూ కమిషనర్ పురపాలన, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధితోపాటు మరో అయిదు శాఖలకు దేవాదాయ శాఖ కమిషనర్ ఇటీవల లేఖ రాయడం కలకలం రేపుతోంది. రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయ శాఖలో 250 మంది ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, అనేక మంది క్లరికల్ సిబ్బంది పని చేస్తున్నారు. ఆలయాల నిర్వహణలో వీరికి అపారమైన అనుభవం ఉంది. డిపార్ట్‌మెంటల్ టెస్టులూ వారు ఉత్తీర్ణులై ఉన్నారు. అనేక మంది తగిన విద్యార్హతలతో దీర్ఘకాలంగా పని చేస్తున్నారు. దేవాదాయ శాఖలో వివిధ కేడర్లలో చాలా అనేక ఖాళీలు ఉన్నప్పటికీ వారికి ఇప్పటివరకు పదోన్నతులు లేకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. సర్వీస్‌పరంగా నష్టపోతున్నారు. ఈ వేలుగా పదోన్నతులు పొందకుండానే చాలా మంది రిటైర్ అవుతున్నారు. ఫలితంగా న్యాయంగా పొందాల్సిన ప్రయోజనాలు వారికి దక్కడం లేదు. రాష్ట్రంలో దేవాదాయ శాఖ నిర్వహణలో పెద్దఎత్తున ఆదాయం, ఆస్తులు కలిగిన దేవాలయాలు 646 వరకు ఉన్నాయి. అయినప్పటికీ ఒక డిప్యూటీ కమిషనర్ పోస్టు, ఆరు అసిస్టెంట్‌క మిషనర్ పోస్టులు, మరో ఆరు ఎగ్జిక్యూటివ్ గ్రేడ్-1 పోస్టులు, 61 వరకు ఎగ్జిక్యూటివ్ గ్రేడ్-3 పోస్టులు సుదీర్ఘంగా భర్తీ కాక ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు ఎగ్జిక్యూటివ్ గ్రేడ్ 1,2,3 పోస్టులు, మఫిసిల్ స్టాఫ్ పోస్టుల్లో అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాల్సిందిగా ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు గతంలో అనేక సార్లు విజ్ఞప్తి చేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పుడేమో ఈవోలు, ఏసీలు, డీసీలుగా డిప్యుటేషన్‌పై పనిచేసేందుకు ఉద్యోగులను పంపాలని పరాయి శాఖలను కోరడం విడ్డూరంగా ఉందని ఉద్యోగులు అంటున్నారు. దేవాదాయ శాఖలో అనేక మంది చాలా ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్, కన్సాలిడేటెడ్ పద్ధతిపై పని చేస్తున్నారు. కనీసం వీరినైనా రెగ్యులరైజ్ చేసి అవసరాన్ని బట్టి ఆయా పోస్టుల్లో వారి సేవలను వాడుకోవచ్చుకదా అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, తెలంగాణ దేవాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.క్రిష్ణమాచారి, ప్రధాన కార్యదర్శి టి.రత్నాకర్ దేవాదాయ శాఖ కమిషనర్‌కు లేక రాశారు. అలాగే దేవాదాయ శాఖ మంత్రి సురేఖను కలిశారు. ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై ఉద్యోగులను తీసుకునే ఆలోచనను మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేవాదాయ శాఖలోని అర్హులైన ఉద్యోగులతోనే ఎగ్జిగ్యూటివ్ ఆఫీసర్స్, ఇతర ఉద్యోగ ఖాళీలను భర్తీచేయాలని అభ్యర్థించారు. దేవాదాయ శాఖలోని ఉద్యోగులకు అన్యాయం చేయవద్దని కోరారు.

నగరాన్ని అభివృద్ధి చేస్తా..

- జీడబ్ల్యూఎంసీ నూతన కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ


అధికారులతో తొలి సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధి చాలా పెద్దదని, ఇక్కడి ప్రజల భాగస్వామ్యంతో నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని నూతన కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. శుక్రవారం జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి రాజేశ్వర్ నుంచి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మీడియాతో మాట్లాడారు. తనకు కరీంనగర్ నగర పాలక సంస్థలో పనిచేసిన అనుభవం ఉందని, మనిసిపాలిటీలో అన్ని వింగ్‌లను ప్రక్షాళన చేస్తానని అన్నారు. వరంగల్ ప్రజలు చాలా చైతన్యవంతులని, కరీంనగర్‌కంటే వరంగల్ నగరంలో ఇంకా ఎక్కువగా పని చేయడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది కలిసి పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన చహత్ బాజ్‌పాయ్ తన కార్యాలయంలో బల్దియా వింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని విభాగాల అధికారులను పరిచయం చేసుకున్న తర్వాత ఒక్కొక్క విభాగం పని తీరు, సిబ్బంది వివరాలు, అందుబాటులో ఉన్న వాహనాల సంఖ్య, డీజిల్, పెట్రోల్ వినియోగం, పని చేస్తున్న సిబ్బంది, తప్పించుకుని తిరిగే సిబ్బంది వివరాలు ఒక్కో విభాగం అధికారిని అడిగి ప్రశ్నల వర్షం కురిపించారు. పని విధానంలో ఎక్కువ మిస్ యూజ్ జరుగుతోంది? అకౌంట్స్ విభాగం నుంచి డీజిల్, పెట్రోల్‌కు నెలకు ఎంత ఖర్చు చేస్తున్నారు? అభివృద్ధి పనులకు ఏ నిధుల నుంచి ఖర్చు చేస్తున్నారు? బిల్లులు ఏ విధంగా చెల్లిస్తున్నారు? అని శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. బల్దియా వాహనాలకు జీపీఆర్ఎస్ సిస్టం అమర్చారా?, అది ఐటీ విభాగానికి అనుసంధానం చేసి ఉందా అని అడిగారు. శానిటేషన్ విభాగంలో ఎంత మంది పని చేస్తున్నారు? ఎక్కడెక్కడ పని చేస్తున్నారు? అని తెలుసుకున్నారు. బల్దియాకు కీలక విభాగం అయిన టౌన్‌ప్లానింగ్‌లో ప్రధాన అధికారిని ఇప్పటి వరకు ఎందుకు నియమించలేదని అక్కడి అధికారులను ప్రశ్నించారు. తాను ప్రజల కోసం పని చేయడానికి వచ్చానని, అధికారులు, సిబ్బంది సహకరిస్తే సక్సెస్‌ఫుల్‌గా సేవలందించవచ్చని అన్నారు. మునిసిపాలిటీలో అన్ని విభాగాలు తనకు తెలుసునని, ఎక్కడ అవినీతి జరిగినా సహించేది లేదని అధికారులను హెచ్చరించినట్టు తెలిసింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అడ్మిన్ రాజేశ్వర్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్, ఇన్‌చార్జిసీపీ రవీంద్రరాడేకర్,పీఆర్‌వో అయూబ్ అలీఖాన్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రవీందర్, హార్టికల్చర్ అధికారులు రమేష్, లక్ష్మారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈ మహేందర్, డీఎఫ్‌వో శంకర్‌లింగంలు పాల్గొన్నారు.

మొలకెత్తని ఆశలు

- వర్షం కోసం అన్నదాత ఎదురుచూపు
- రుతుపవనాలు తాకినా కనిపించని చినుకులు
- సూక్ష్మ సేద్యంతో రైతుల తిప్పలు


స్ప్రింక్లరల ద్వారా పత్తి చేనును తడుపుతున్న రైతు

చిట్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అడపాదడపా కురిసిన వర్షాలకు వేలాది ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తిన రైతులు వాటిని బతికించుకునేందుకు అరిగోస పడుతున్నారు. స్ప్రింకర్లతో నీటినిపడుతూ ఇబ్బందులు పడుతున్నారు.ఆశలతో పంటలు సాగుచేస్తున్న రైతులకు జూన్ నెలలో సాధారణం కంటే తక్కువ వర్షాపాతం నమోదవుతుండడంతో ఆశలు కోల్పోతున్నారు. కొంతమంది రైతులు బావుల కింద ఉన్న మోటార్లతో పైపుల ద్వారా కాలువలు తీసి నీటిని అందిస్తుండగా కొంత మంది రైతు లు స్ప్రింక్లర్ల ద్వారా మొలకెత్తిన గింజలను కాపాడుకునేందుకు నానా యాతన పడుతున్నారు. చిట్యాల మండలంలోని చల్లగరిగె, నైన్‌పాక, వెలిశాల, టేకుమట్ల మండలం, రేగొండ మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో సుమారు 2.47 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ముందస్తుగా పత్తి విత్తనాలు విత్తడంతో రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.

యోగా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

మహబూబాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వాల్‌పోస్టర్లను కలెక్టరేట్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చని, ఇది శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారి, జిల్లా అధికారులు శ్రావణ్‌కుమార్, జ్యోతి, డాక్టర్ హేమానుందర్, కమల్, పావని, నవీన్ పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి : ఎన్డీ

మహబూబాబాద్ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ.. జిల్లాలోని గార్ల మండలం మద్దివంచ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్లు 116, 119లలో సుమారు 900 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. గత 70 సంవత్సరాలకు పైగా గిరిజన, గిరిజనేతర పేద రైతులు సేద్యం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని చెప్పారు. భూములకు వెంటనే హక్కు పత్రాలు అందించి సాగు పెట్టుబడి కింద వారికి సకాలంలో రుణాలను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో గుగులోతు సక్రు, శివ్వారపు శ్రీధర్, బోనగిరి మధు, బాబురావు, గౌని భద్రయ్య, రంగారావు, మల్లేష్, బావ్ సింగ్, అప్పయ్య, మంగయ్య, వెంకటేశ్వర్లు, రాములు, జయమ్మ పాల్గొన్నారు.

టవర్ ఎక్కిరైతు నిరసన

- గ్రీన్‌ఫీల్డ్ హైవే కింద భూమి పోతున్నా నష్టపరిహారం అందించలేదు

కురవి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కురవి మండలం అయ్యగారిపల్లి మీదుగా వెళ్తున్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిలో తన భూమి నష్టపోతున్నానని, సంబంధిత అధికారులు నష్టపరిహారం అందించకుండా వేధిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన నూకల రవి అనే రైతు పురుగుల మందు డబ్బాతో టవర్ ఎక్కి శుక్రవారం నిరసనకు దిగాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు టవర్ వద్దకు చేరుకుని రవికి నచ్చజెప్పి కిందకు దించారు. తన భూమి ఎకరం 34 గుంటలు రహదారి పనుల్లో భాగంగా పోతుండగా ఎకరానికి మాత్రమే రూ.15లక్షలు చెల్లించారని, 34 గుంటలకు నగదు రావాలని రవి అధికారులకు తెలిపారు. అయితే రవికి చెందిన ఇద్దరు అన్నదమ్ముల మధ్య భూమి వివాదం కోర్టులో ఉందని, అందుకే జాప్యం జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

పూర్వప్రాథమిక తరగతులను ప్రారంభించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పూర్వప్రాథమిక తరగతులను ప్రారంభించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్, ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ముందు ప్రతి పాఠశాలలో పూర్వప్రాథమిక తరగతులు ప్రారంభిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 18 జిల్లాల్లో 210 పూర్వప్రాథమిక పాఠశాలలు మంజూరు చేయడం సమంజసం కాదన్నారు. అత్యధిక గిరిజనులు ఉన్న జిల్లాలో ఒక్క పూర్వప్రాథమిక పాఠశాలను కూడా ప్రారంభించక పోవడాన్ని టీపీటీఎఫ్ జిల్లా శాఖ ఖండిస్తుందని అన్నారు.

సీపీఐ జిల్లా మహాసభల లోగో ఆవిష్కరణ

కురవి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కురవిలో జూలై 5, 6 తేదీల్లో జరిగే సీపీఐ 3వ జిల్లా మహాసభల లోగోను ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యక్రమాలను విస్తరించడానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు, సంక్షేమ పథకాలు పేదలకు అందే విధంగా మహాసభల్లో ప్రణాళికలు రూపొందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కర్నం రాజన్న, బుడమ వెంకన్న, దూదికట్ల సారయ్య, కన్నె వెంకన్న, కలగూర నాగరాజు, ఇరుగు సుగుణ, నిలుగొండ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలి

కురవి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామ గ్రామాన తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర పరిశీలకులు సుతారపు వెంకటనారాయణ అన్నారు. కురవిలో శుక్రవారం టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా కురవి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పేరం వీర స్వామి, కార్యదర్శిగా నామ పద్మాకర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల నాటికి డోర్నకల్ నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యేను గెలిపించే విధంగా కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంటరీ ఇన్‌చార్జ్ కొండపల్లి రాంచందర్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ దారావత్ వెంకటేష్, చింతల నాగేశ్వర్‌రావు, రొట్టెల లింగయ్య, గుగులోతు వెంకన్న, నర్సయ్య, పర్షలింగం, శరత్, బలరాం, ఎస్‌కె.నబీ, రమేష్ పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

గూడూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గూడూరు 108 అంబులెన్స్‌లో శుక్రవారం ఓ గిరిజన మహిళ సాధారణ ప్రసవం ద్వారా పండంటి మగ శిశువుకు జన్మనిచ్చింది. గూడూరు మండలం గుండెంగ శివారు నల్లబోడు తండాకు చెందిన బానోత్ ఐశ్వర్య 9 నెలల నిండు గర్భిణి. ఆమెకు శుక్రవారం పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108 వాహనానికి ఫోన్ చేశారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్ ఐశ్వర్యను ఎక్కించుకుని గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు వస్తుండగా గాజులగట్టు క్రాస్‌రోడ్డు వద్ద చేరుకోగానే నొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది సాధారణ ప్రసవం చేశారు. దీంతో ఐశ్వర్య పండంటి మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డలను గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సాధారణ ప్రసవం చేసిన 108 అంబులెన్స్ టెక్నీషియన్ లలిత, సిబ్బంది పాషాలను 108 అంబులెన్స్ జిల్లా మేనేజర్ బత్తిని మహేష్ అభినందించారు.

నల్లబెల్లం పట్టుకొని వదిలేశారు?

- విక్రయదారుల నుంచి అక్రమ వసూళ్లు
- సంఘటనపై ఇంటెలిజెన్స్ అధికారుల ఆరా..

నర్సింహులపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామ పంచాయతీ శివారులో కారులో తరలిస్తున్న నల్లబెల్లాన్ని ఓ శాఖకు చెందిన ఇద్దరు అధికారులు గురువారం రాత్రి పట్టుకుని చేతివాటం ప్రదర్శించి వదిలేసినట్లు విశ్వసనీయ సమాచారం. అజ్మీరా తండా సమీపంలోని సేవాలాల్ గుడి వద్ద కారులో నల్లబెల్లం తరలిస్తున్నరనే సమాచారంతో ముందస్తుగానే మాటువేసి ఉన్న ఇద్దరు అధికారులు కారును అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సమీపంలోని రహస్య ప్రదేశంలోకి తీసుకెళ్లి బేరం కుదుర్చుకుని చేతివాటం ప్రదర్శించి వదిలేసినట్లు.. ఈ విషయం తెలుసుకున్న ఒక వర్గానికి చెందిన ఇద్దరు ఘటన స్థలానికి చేరుకోవడంతో వారికి కూడా వాటా ఇచ్చినట్లు పెన్ను, గన్ను అంటూ సోషల్ మీడియా వేదికగా వాట్సాప్‌లలో చక్కర్లు కొట్టడంతో వైరల్‌గా మారింది. పట్టుకున్న బెల్లం ఎంత? పట్టుకున్నది ఎవరు? బెల్లం వ్యాపారులతో కుదిరిన బేరం ఎంత? అనే కోణంలో ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. దీనిపై ఎస్సై సురేష్‌ను వివరణ కోరగా అలాంటి విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు.

మంత్రాల అనుమానం.. ఆపై బోరు వివాదం

- అన్న కుటుంబంపై కత్తులతో దాడి
- ముగ్గురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- జనగామ జిల్లా కొన్నె గ్రామంలో ఘటన

బచ్చన్నపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మంత్రాలు చేస్తున్నాడనే అనుమానం.. వ్యవసాయ బావి వద్ద బోరు విషయంలో గొడవ ఇద్దరు అన్నదమ్ముల కుటుంబాల మధ్య చిచ్చురేపింది. తమ్ముడి కుటుంబ సభ్యులు.. అన్న కుటుంబంపై కత్తులతో దాడి చేయడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్‌ఐ ఎస్‌కే హమీద్ తెలిపిన ప్రకారం... జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన కురాం కిష్టయ్య, కురాం నర్సింహులు అన్నదమ్ములు. వీరికి వ్యవసాయ బావి వద్ద గల బోరు విషయంలో గత కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. కిష్టయ్య కుటుంబం తమపై మంత్రాలు చేస్తున్నారనే కక్ష పెంచుకున్నారు. గురువారం సాయంత్రం వ్యవసాయ బావివద్ద బోరు విషయంలో మరోసారి గొడవ పడ్డారు. ఇంటికి వచ్చాక రాత్రి 11గంటల సమయంలో నర్సింహులు, అతని భార్య అంజమ్మ, కుమారుడు గణేష్‌లు కిష్టయ్య ఇంటికి వెళ్లి కత్తులతో దాడి చేయగా, కిష్టయ్యతోపాటు అతని కుమారుడు భాస్కర్ తీవ్రంగా గాయపడగా, భార్య యాదమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ దాడిలో భాస్కర్, కిష్టయ్యలకు తీవ్ర రక్తస్రావం కావడంతో బచ్చన్నపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. భాస్కర్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. భాస్కర్ భార్య సుజాత శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రక్తపోటు, డయాబెటిక్‌కు మందులు వాడాలి

- జిల్లా వైద్యాధికారి రవిరాథోడ్

మహబూబాబాద్ టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రక్తపోటు, డయాబెటిక్ వ్యాధులు నిర్ధారించబడితే వారు క్రమం తప్పకుండా మందులు వాడాలని జిల్లావైద్యాధికారి రవిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం నర్సింగ్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో రవిరాథోడ్ మాట్లాడుతూ....టెలిమానస్ కార్యక్రమంలో భాగంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించి చికిత్సఅందించాలని సూచించారు. అసంక్రమణ వ్యాధుల ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఆబా కార్డులను విరివిగా జనరేట్ చేయాలని అన్నారు. సమావేశంలో కొప్పు ప్రసాద్, రామకృష్ణ, సౌమిత్, రమేష్ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవిరాథోడ్

ఆర్‌ఎంపీలు నిబంధనల మేరకే వైద్యం అందించాలి

డోర్నకల్: ఆర్‌ఎంపీలు ప్రభుత్వ నియమ నిబంధనల మేరకే వైద్య సలహాలు, ప్రథమ చికిత్స అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవిరాథోడ్ అన్నారు. డోర్నకల్‌లోని ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న పలు ప్రథమ చికిత్స కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాలను మూసివేయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే అందించి మెరుగైన వైద్య సేవల కోసం ఆస్పత్రులకు తరలించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

ముగ్గురికి గాయాలు

తొర్రూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు పట్టణ శివారు దుబ్బతండా వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ కేంద్రానికి చెందిన పల్లె వివేక్ (బిట్టు) దుబ్బతండా వద్ద పెట్రోల్‌బంక్ నుంచి బయటికి వస్తున్నాడు. ఈ క్రమంలో దంతాలపల్లి నుంచి తొర్రూరుకు మరో ఇద్దరు యువకులు సాయి, వెంకట్ ద్విచక్ర వాహనంపై వస్తూ వివేక్ నడుపుతున్న వాహనాన్ని ఢీకొట్టడంతో కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. బిట్టు కాలు మూడుచోట్ల విరిగింది. సాయి, వెంకట్‌లకు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో వివేక్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. గాయాలైన సాయి, వెంకట్‌లకు తొర్రూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టై, బెల్టులు అందించడం అభినందనీయం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు టై, బెల్టులు అందించడం అభినందనీయమని జిల్లా ట్రెజరరీ అధికారి(డీటీవో) వెంటపల్లి సత్యనారాయణ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుడు ఆవారి శ్రీనివాస్ ఆర్థిక సాయంతో విద్యార్థులకు టై, బెల్టులను సమకూర్చగా డీటీవో సత్యనారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారన్నారు. పాఠశాలల ప్రారంభం నుంచే పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రంలో మానుకోట జిల్లాను మరోమారు అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయ బృందం జిల్లా ట్రెజరరీ అధికారిని శాలువాతో సన్మానించారు. హెచ్‌ఎం పూజారి వీరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

నెల్లికుదురు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల నల్లబెల్లం, 3 క్వింటాళ్ల పటికను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్.రమేష్‌బాబు తెలిపారు. మహబూబాబాద్ మండలం వేమునూరు శివారు బాబునాయక్ తండాకు చెందిన భూక్య అరుణ్, బాదవత్ సుమన్, బానోత్ గణపతి, బానోత్ రవీందర్, కార్తీక్‌లు ఓ వాహనంలో రూ.2.5 లక్షల విలువచేసే 25 క్వింటాళ్ల నల్లబెల్లం, 3క్వింటాళ్ల పటిక తరలిస్తున్నారు. ఈ క్రమంలో నెల్లికుదురు క్రాస్‌రోడ్డు వద్ద పట్టుకొని వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. బెల్లం అక్రమ రవాణా చేస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు పేర్కొన్నాడు.

ఖాళీలను భర్తీ చేయాలి : ఏఐసీటీయూ

కేసముద్రం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వివిధ అధికారుల పోస్టులను భర్తీ చేయాలని ఏఐసీటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కంచ వెంకన్న కోరారు. హైదరాబాద్‌లో శుక్రవారం కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్‌కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు దరఖాస్తు చేసుకున్న మూడు నెలల లోపు బీమా, సంక్షేమ పథకాల డబ్బులను జమ చేయాలని కోరారు. మహబూబాబాద్, తొర్రూరు కార్మిక శాఖ కార్యాలయాల్లోని పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

సీఎం, ప్రభుత్వ సలహాదారు వేం, ఎమ్మెల్యే మురళీనాయక్‌ల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మహబూబాబాద్ టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహబూబాబాద్, కేసముద్రం మునిసిపాలిటీల అభివృద్ధికి రూ.150 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరీ చేసిన సందర్భంగా స్థానిక మదర్ థెరిస్సా సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌ల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్‌పాషా, కాంగ్రెస్ అర్బన్ మాజీ అధ్యక్షుడు రామగోని రాజు, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆరెందుల వెంకటేశ్వర్లు, ఎడ్ల రమేష్ మాట్లాడుతూ.. మానుకోట, కేసముద్రం మునిసిపాలిటీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరీ చేయడం అభినందనీయమన్నారు. రెండు మునిసిపాలిటీలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుని రాష్ట్రంలో మోడల్ పట్టణాలుగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో నీరుటి సురేష్‌నాయుడు, పోతురాజు రాజు, హరిసింగ్, బొల్లు రాజు, నాళ్ల లక్ష్మీనర్సింహారావు, నర్సింగం శ్రీను, బోనగిరి గిరిధర్‌గుప్తా, సదాశివుడు, యాకూబ్, నిమ్మల శ్రీను, చలమల నారాయణ, కోడి శ్రీను, గోనె శ్యాంరావు, వంగ వెంకటరమణ, గునిగంటి కమలాకర్, శంకర్, భూక్య లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో సీఎం, ప్రభుత్వ సలహాదారు వేం, ఎమ్మెల్యే మురళీనాయక్‌ల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్ టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వర్షా కాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రమీలరావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధి ఇందిరానగర్ కాలనీలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మురికి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేశారు. సీజన్‌లో వచ్చే డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్, మెదడు వాపు లాంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వ్యాధి వచ్చిన తర్వాత కాకుండా వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మురికిగుంతల్లో ఆయిల్ బాల్స్ వేయడం వల్ల దోమల పెరుగుదలను, లార్వాలను అరికట్టవచ్చని తెలిపారు. వర్షా కాలంలో వేడి పదార్థాలు భుజించాలని, కాచి చల్లార్చి వడబోసిన నీటిని మాత్రమే తాగాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, వడ్డెబోయిన శ్రీనివాస్, పురుషోత్తం, శ్రీనివాస్, సక్కుబాయి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

గుమ్చిదారులకు న్యాయం చేయాలి : సీపీఐ

మహబూబాబాద్ టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవాలయం వద్ద గతంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ప్రారంభించిన గుమ్చిలను ఇప్పుడు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం సరైంది కాదని సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి అన్నారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఆఫీసర్(టీపీఎస్) ప్రవీణ్‌కు వినతి పత్రాన్ని అందించి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ... చిరువ్యాపారులు కన్యకాపరమేశ్వరీ ఆలయం వద్ద గుమ్చిలను ఏర్పాటు చేసుకుని చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. ఈ క్రమంలో మునిసిపల్ అధికారులు గుమ్చిలను ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారని చెప్పారు. గుమ్చిలు ఖాళీ చేస్తే వారి జీవనోపాధి పోతుందని, నోటీసులను వెనక్కి తీసుకుని గుమ్చిదారులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, డి.రమేష్ పాల్గొన్నారు.

44 కార్మిక చట్టాల రద్దు అప్రజాస్వామికం

- ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి నర్సయ్య

గూడూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పోరాడి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించడం అప్రజాస్వామికమని అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం(ఏఐసీటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి నర్సయ్య అన్నారు. గూడూరు మండల కేంద్రంలో ఏఐసీటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ... హమాలీ, ట్రాన్స్‌పోర్టు, భవన నిర్మాణ, ఇటుక బట్టీ, బీడీ కార్మికులు, గ్రామ పంచాయతీ, మునిసిపల్ కార్మికులు, అంగన్‌వాడీ వర్కర్స్‌కు కనీస వేతనచట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 21, 22 తేదీల్లో జిల్లా కేంద్రంలో ఏఐసీటీయూ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మర్రిపెల్లి మొగిలి, వాంకుడోతు మొగిలి, శివనాదులశ్రీనివాస్, ప్రియాంక, కవిత, సాంబయ్య, రమ పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు ఇవ్వడమే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

నిర్మించుకోవాలని సూచించారు. ఉచితంగా ఇసుక ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. 30 పడకల ఆస్పత్రికి అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను కోరారు. రైతు భరోసా కూడా త్వరలోనే ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. పాకాల చెరువు నుంచి లిఫ్ట్ ద్వారా కొత్తగూడ, గంగారం మండలాలకు సాగునీరు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన జిల్లా కోటతో పాటు కొత్తగూడ, గంగారం మండలాలకు ఐటీడీఏ ద్వారా అదనంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కావడం సంతోషంగా ఉందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇచ్చామన్నారు. ఇళ్లకు ముగ్గులు పోసి నిర్మాణాలు ప్రారంభించామని తెలిపారు. పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

'పది'లో జిల్లా మొదటి స్థానం అభినందనీయం

పదవ తరగతి ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లా మొదటి స్థానం సాధించడం అభినందనీయమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, డీఈవో రవీందర్‌రెడ్డి, విద్యాశాఖ అధికారులను మంత్రి సీతక్క అభినందించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ములుగు జిల్లా మొదటి స్థానం సాధించిందని పేర్కొన్నారు. విద్యాశాఖను బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచడంతో పాటు స్కూల్ ప్రారంభం నాడే పుస్తకాలు, యూనిఫాంలు అందజేస్తున్నామని చెప్పారు.

మహిళా సంఘాలను బలోపేతం చేసేలా వారితోనే యూనిఫాంలు కుట్టిస్తున్నామన్నారు. అంగన్‌వాడీలను బలోపేతం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, నర్సరీ విద్య బోధించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టొప్పో, ఆర్డీవో కృష్ణవేణి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో పీడీ మధుసూదన్‌రాజు, ప్రత్యేకాధికారి సురేష్, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో రవీంద్రప్రసాద్, ఏపీఎం శ్రీనివాస్, ఎంఈవో గుమ్మడి లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం గుమ్మడి లలిత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

కొత్తగూడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసకెళ్లాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పిలుపు నిచ్చారు. కొత్తగూడలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు నేను పోటీ చేసిన ప్రతి ఎన్నికల్లోనూ కొత్తగూడ, గంగారం మండలాల్లో అత్యధిక మెజారిటీ ఇచ్చారని పేర్కొన్నారు. నేడు సైతం స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. మండలంలోని ఎంచగూడెం గ్రామానికి చెందిన జిట్టబోయిన రాములు, జున్ను రవీందర్, తుపాకుల ఎల్లయ్య బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో సీతక్క సమక్షంలో చేరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, ఉపాధ్యక్షుడు కర్ర జనార్దన్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వారంలో ఎన్నికలు వస్తున్నట్టు మంత్రి చెప్పలేదు..

కొత్తగూడ: స్థానిక సంస్థల ఎన్నికలు వారంలో రానున్నట్టు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చెప్పలేదంటూ సోషల్ మీడియాలో ప్రకటన చక్కర్లు కొడుతోంది. ముందుగా వారంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నట్టు మంత్రి సీతక్క పేర్కొన్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. కానీ, అలాంటి వ్యాఖ్యలు సీతక్క చేయలేదంటూ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రకటన వచ్చింది. ఈ ప్రచారంపై బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలిని వివరణ కోరగా స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మంత్రి సీతక్క పేర్కొన్నట్టు చెప్పారు.

రైతులు లాభసాటి పంటలు ఎంచుకోవాలి

నర్సింహులపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రైతులు లాభసాటి పంటలను ఎంచుకోవాలని కేవీకే మాల్యాల కో-ఆర్డినేటర్ మాలతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్త అనే కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకుని రశీదులు భద్రపరుచుకోవాలని చెప్పారు. అధీకృత లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద మాత్రమేవిత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. వానాకాలం సీజన్‌కు రైతు భరోసా నిధులు మంజురవుతాయని చెప్పారు. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం వచ్చిన రైతులు సంబంధిత పత్రాలతో ఏవో ఆఫీసులో ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను వినియోగించుకోవాలన్నారు. అలాగే యిల్‌పామ్, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కిషోర్, క్రాంతి, ఏవో వినయ్, మండల ఉద్యాన శాఖ అధికారి మానస, ఏఈవోలు శరత్, బాబు, కల్యాణి పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో బ్రాహ్మణులకు ప్రాధాన్యత ఇవ్వాలి

తొర్రూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల్లో బ్రాహ్మణ ప్రతినిధులకు ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర బ్రాహ్మణ అఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ కార్యదర్శి వింజమూరి సుధాకర్ అన్నారు. ఇటీవల వరంగల్ భద్రకాళి దేవస్థానం డైరెక్టర్‌గా నియమింపబడిన మోత్కూరి మయూరి-రాము దంపతులను సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తొర్రూరులో ఘనంగా సత్కరించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల జనాభా బ్రాహ్మణులు ఉన్నారని, రాబోయే స్థానిక ఎన్నికలు, మునిసిపాలిటీ, ఇతర నామినేటెడ్ పోస్టుల్లో బ్రాహ్మణులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సాకారంతో పేద బ్రాహ్మణుల కోసం ప్రభుత్వం వంద కోట్లు కేటాయించిందని, దానిలో విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు రూ.43కోట్లు విడుదల చేయడం అభినందనీయమన్నారు. పేదబ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు, ఉపకార వేతనాలు అందజేయాలని, దేవాదాయ భూములను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలోబ్రాహ్మణసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగు నవీన్‌శర్మ, విష్ణుదాసు, వెన్నప్ప కృష్ణమోహన్, వెన్నప్ప సంతోష్ శర్మ, వంశీధర్ రావు, గోవర్ధనం రాము, ఓలేటి లక్ష్మణాచార్యులు, వెంకన్న పాల్గొన్నారు.



మయూరి రాము దంపతులను సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

బయ్యారం చెరువుకు గోదావరి జలాలు మళ్లించాలి

బయ్యారం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కాకతీయుల నాటి బయ్యారం పెద్ద చెరువు కాలువలకు శాశ్వత మరమ్మతులు చేపట్టి గోదావరి జలాలు మళ్లించేలా చర్యలు చేపట్టాలని వామపక్ష పార్టీలైన సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బయ్యారంలో వారు బైక్ ర్యాలీ చేపట్టి బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకతీయులు నిర్మించిన బయ్యారం పెద్ద చెరువు నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి నేటి తెలంగాణ రాష్ట్రం వరకు వివక్షకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతం గుండా పారుతున్న గోదావరి జలాలను ఆంధ్ర వలసదారులు జల దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు నీటిని బయ్యారం చెరువుకు రాకుండా పాలేరు జలాశయానికి తరలించుకపోవడమే జల దోపిడీకి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా ఏమి ఉపయోగం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గోదావరి జలాలను బయ్యారం పెద్ద చెరువుకు మళ్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, రాజన్న, కలింగరెడ్డి, సూర్యనారాయణ, భిక్షం, మధు, వీరభద్రం, రాకేష్, మురళి, వెంకన్న, నాగేశ్వరరావు, యాకయ్య, లచ్చయ్య, మంగీలాల్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



బయ్యారంలో రాస్తారోకో చేస్తున్న వామపక్షాల నేతలు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

బయ్యారం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించి మోసం చేస్తే చట్ట ప్రకారం శిక్షించాల్సి వస్తుందని మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎస్సై తిరుపతి, ఏవో రాంజీనాయక్ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, విత్తన విక్రయదారులను హెచ్చరించారు. మండలంలోని కొత్తపేట, గంధంపల్లి గ్రామాల్లో శుక్రవారం శ్రీదేవి, ఏఆర్‌ఎస్‌కే షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు షాపుల్లోని రిజిస్టర్లు, విత్తనాలను తనిఖీ చేశారు.